క్లుప్తంగా

లేఅవుట్ల రెగ్యులరైజేషన్‌కు మరో అవకాశం



మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు వేసిన అనధికారిక లేఅవుట్లలో స్థలాలు కొన్నవారు రెగ్యులేషన్ స్కీం ద్వారా రెగ్యులరైజ్ చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న లేఅవుట్లలో 90 శాతం వరకు రెగ్యులరైజ్ కాలేదన్నారు. ప్లాట్ విలువ ఆధారంగా రుసుం చెల్లించాల్సి ఉంటుందనాను. లేఅవుట్‌లో పది శాతం ఖాళీ స్థలం లేని వారు అదనంగా 14 శాతం కట్టాల్సి ఉంటుందని తెలిపారు. మూడు నెలలు మాత్రమే గడువు ఉన్నందున అవసరమైన వారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పుంగనూరు: మండల విద్యాశాఖ పోస్టులను జిల్లా పరిషత్ యాజమాన్యానికి ఇవ్వాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎంఈవో-1 పోస్టులను అర్హులైన జిల్లా పరిషత్ యాజమాన్యంకు దక్కాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రుద్రాణి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రమణ, చంద్రశేఖర్, రామకృష్ణ, జీవలత, చాముండేశ్వరి, సుగుణమ్మ, హబీబా, రెడ్డి, రాజేశ్వరి, అరుణ, వనజ, తులసి, మీనా, శైలజ, పద్మావతి, అనిత, గాయత్రి, జ్యోతి, తనూజ తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు విషయంపై మంత్రికి వినతి



మంత్రికి విన్నవిస్తున్న మండల నాయకులు

వి.కోట: గతంలో వి.కోటకు మంజూరైన బైపాస్ రోడ్డును కర్ణాటక మీద కాకుండా మండలానికి తూర్పు వైపున వేసేలా అలైన్‌మెంట్ మార్చి మండల అభివృద్ధికి సహకరించాలని పలువురు నాయకులు కోరారు. వారు శుక్రవారం పలమనేరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మదనపల్లి -కృష్ణగిరి రహదారి విస్తరణలో భాగంగా రోడ్డును కర్ణాటక మీదుగా వేయాలని గతంలో అధికారులు నిర్ణయించారని తెలిపారు. దీనిపై తాము రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి స్టేటస్కో ఉత్తర్వులు పొందామని తెలిపారు. ఈ క్రమంలో వి.కోట పట్టణానికి తూర్పు వైపున నాలుగు లేన్ల బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరారు. తద్వారా తమ మండలం అభివృద్ధి చెందుతుందని వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఈ అంశాన్ని నేషనల్ హైవే అథారిటీ దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.


పింఛన్ల పంపిణీలో మంత్రి



బైరెడ్డిపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

బైరెడ్డిపల్లె: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి బైరెడ్డిపల్లెలో పర్యటించారు. ఇందులో భాగంగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గుంతలు లేని రోడ్లు ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుడతామన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కమిషనర్

పలమనేరు: మున్సిపాలిటీలో ఆగస్టు నెలకు సంబంధించిన పింఛన్లను శుక్రవారం 95 శాతం మందికి పంపిణీ చేశామని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. పట్టణంలో మొత్తం 4,546 పింఛన్లు వుండగా 4343 మందికి నగదు పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి శనివారం సాయంత్రంలోపు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు.

5 వేల మందికి సుఖీభవ లేనట్టే!

పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రతి ఏటా రైతులు నష్టపోతున్నారు. పెట్టుబడి కూడా పెట్టలేని పరిస్థితి. వారిని ఆదుకునేందుకు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి రైతు భరోసా పథకాన్ని అమలుచేశారు. ప్రతి ఏటా రూ.13,500ల పెట్టుబడి సాయం అందించారు. చంద్రబాబునాయుడు 2024 ఎన్నికల్లో అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేల సాయం చేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటిన తర్వాత పథకం అమలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ గణాంకాలను బట్టి ఐదువేల మందికి పైగా రైతులకు పథకం అందనట్టేనని తెలుస్తోంది. ఇప్పటి వరకు అనర్హుల జాబితాను సైతం అధికారులు బయటపెట్టలేదు. ఇదిలా వుండగా శనివారం నుంచి అన్నదాత సుఖీభవ నిధులు జమకానున్నట్టు వ్యవసాయ శాఖ తెలిపింది.



గత ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా లోగో



కూటమి పాలనలో అన్నదాత సుఖీభవ లోగో

- వైఎస్సార్‌సీపీ హయాంలో 45,396 మంది లబ్ధిదారులు
- ప్రస్తుతం 38,375 మంది అర్హులుగా ఎంపిక
- వీరిలో టెక్నికల్ సమస్యలున్న వారు 1291 మంది
- మిగిలిన 5,757 మంది రైతులు ఔట్
- నేడు పలమనేరు డివిజన్‌లో అన్నదాత సుఖీభవ

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 45,396 మందికిపైగా రైతులు వున్నారు. సుమారు 30 వేల హెక్టార్లకు పైగా వ్యవసాయ భూములు వున్నాయి. ప్రతి ఏటా 14 వేల హెక్టార్లలో వేరుశనగ, 6 వేల హెక్టార్లలో వరి, అన్ని రకాల కూరగాయల పంటలు సాగు చేస్తుంటారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని పంటలు సాగు చేసుకునేవారు. అరుగాలం కష్టపడి పంటలు పండించినా గిట్టుబాటు ధర అందే పరిస్థితి వుండేది కాదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. వారిని ఆదుకునేందుకు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కింద రూ.13,500ల పెట్టుబడి సాయం అందించేవారు. ప్రతి ఏటా పంటల సాగుకు ముందే నిధులు ఇవ్వడం వల్ల అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకునే అవసరం వుండేది కాదు. 2024 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు రైతు భరోసాను కాపీకొట్టి అన్నదాత సుఖీభవ పథకంగా పేరు పెట్టి ఏటా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చి

మండలం	లబ్ధిదారుల సంఖ్య
పలమనేరు	5264
బైరెడ్డిపల్లి	8043
వీకోట	9899
గంగవరం	7542
పెద్దపంజాణి	7627
మొత్తం	38,375

ఏడాది పూర్తయినా పథకాన్ని అమలుచేయలేదు. ఇప్పుడు వ్యవసాయ శాఖ అధికారులు అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. 38,775 మందికి అన్నదాత సుఃఖీభవ పడనుంది. వీరిలో ఇంకా వెబ్‌ల్యాండ్‌లో నోడేటా, బ్యాంకు ఖాతాకు ఆధార్ లింకు లేనివారు, ఆధార్‌కు ఈకేవైసీ లేనివారు, ఇన్‌యాక్టివ్ బ్యాంకు ఖాతాల పేరిట డివిజన్‌లో 1221 మంది వున్నట్టు తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది ఈ పథకాన్ని అసలివ్వనేలేదు. ఈ దఫా తొలివిడతగా రూ.5 వేలు మాత్రమే ఇవ్వనున్నారు.

గత ప్రభుత్వంలో 45,396 మందికి లబ్ధి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలోని 45,396 మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం వర్తించింది. ఏటా మూడు విడతలుగా (ఖరీఫ్‌లో పంట సాయంగా రూ.7,500, అక్టోబర్‌లో రూ.4 వేలు, జనవరిలో రూ.2 వేలు) మొత్తం రూ.13,500 జమయ్యేది. దీంతోపాటు పీఎం కిసాన్ ద్వారా రూ.6 వేలు పడేది. ఈ నియోజకవర్గంలో గతంలో రైతు భరోసా ద్వారా రూ.225 కోట్ల లబ్ధి జరిగింది.

మిగిలిన 5 వేల మంది రైతుల పరిస్థితేంటి...

గతప్రభుత్వంలో లబ్ధిదారులుగా ఉండి కూటమి ప్రభుత్వంలో కోతకు గురైన 5757 మంది రైతుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. సాంకేతిక సమస్యలున్న 1291 మంది రైతులు వాటిని సరిదిద్దుకున్నాక వారి ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని అధికారులు చెబుతున్నారు. మిగిలిన రైతులు ఎందుకు అనర్హులయ్యారో తెలపలేదు. ఈ విషయమై ఇక్కడి అగ్రికల్చర్ అధికారులను సంప్రదించగా సాంకేతిక సమస్యలున్న రైతులు వివరాలను సరిదిద్దుకుంటే వారి ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని, ఇందుకుగాను రైతు సేవా కేంద్రాల్లో అగ్రి అసిస్టెంట్లను కలవాలని సూచించారు.

రొంపిచెర్లలో 4,221 మంది రైతులకు అన్నదాత సుఖీభవ

రొంపిచెర్ల: మండలంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల్లో 4,221 మంది రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు మంజూరైట్లు ఏవో శ్రావణి తెలిపారు. మండలంలోని బండకిందపల్లె సచివాలయ పరిధిలో 241 మంది, బొమ్మయ్యగారిపల్లెలో 633 మంది, పెద్దమల్లెలలో 1077 మంది, గానగచింతలో 621 మంది, మోటుమల్లెలలో 744 మంది, పెద్దగొట్టిగల్లులో 262 మంది, రొంపిచెర్లలో 643 మంది రైతులు అర్హులుగా వున్నారని పేర్కొన్నారు. 120 మంది రైతులు ఈకేవైసీ చేసుకోలేదని తెలిపారు. కేంద్రం రూ.2 వేలు, రాష్ట్రం రూ.5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతుల బ్యాంక్ ఖాతాల్లో శనివారం నగదు జమ అవుందని వెల్లడించారు.

నోటీస్ బోర్డు

నేడు బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ

చౌడేపల్లి: మండలంలోని వెంగళపల్లె, కొండామర్రి, గడ్డంవారిపల్లె, పరికిదొన పంచాయతీల్లో శనివారం బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి తెలిపారు. అలాగే గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గంగిశెట్టి మృతి తెలుగు సాహిత్యలోకానికి తీరని లోటు



ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ

పలమనేరు: ద్రవిడ విశ్వ విద్యాలయ విశ్రాంత ఉపకులపతి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ మృతి తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటని ప్రముఖ కవి, రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. స్థానిక పలమనేరు రచయితల సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆచార్య గంగిశెట్టికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సిరికోన అకాడమీ వ్యవస్థాపకులుగా ఆయన చేసిన సేవలు ఘనమైనవని తెలిపారు. ఆయన సాహిత్య సేవలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందజేసి గౌరవించిందని తెలిపారు. వారు తెలుగు శాసనాలపై చేసిన పరిశోధనలు మరువలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు మాధవ్, అధ్యక్షులు పలమనేరు బాలాజీ, రచయితలు కుమారస్వామి రెడ్డి, తులసీనాథం నాయుడు, గండికోట వారిజ, దోర్నాదుల సిద్దార్థ, మల్లిచెట్ల దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ఎండగడదాం



చౌడేపల్లె మండలం లద్దిగంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

చౌడేపల్లె: అధికారం కోసం సాధ్యం కానీ హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.దామోదరరాజు, మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ ఆరోపించారు. వారు శుక్రవారం లద్దిగం, కాటిపేరి, కాగతి, దిగువపల్లె, చౌడేపల్లె పంచాయతీల్లో బాబూ ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ఇప్పటికే మూడు సార్లు కరెంటు బిల్లులు పెంచి ప్రజల నడ్డి విరిచారని దుయ్యబట్టారు. అన్నదాత సుఖీభవ పేరిట రైతులకు రూ.20 వేలు ఇస్తామని చెప్పి కేంద్రం ఇచ్చిన నిధులను కూడా పక్కదారి పట్టించారని విమర్శించారు. గ్రామ కమిటీల ఆధ్వర్యంలో నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అవినీతి, మోసాన్ని ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అలాగే గ్రామ కమిటీలను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, లడ్డూ రమణ, ఎంపీటీసీ జ్యోతమ్మ, సర్పంచులు షంషీర్, సరిత, సోని, లక్ష్మీదేవి, వరుణ్, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, వసీం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రాలపై మహిళా రైతులకు శిక్షణ





వ్యవసాయ పరికరాలపై మహిళలకు అవగాహన, పవర్‌వీడర్‌ను వాడుతున్న మహిళా రైతు

పలమనేరు: మండలంలోని బయ్యప్పగారి పంచాయతీలోని మహిళా రైతులకు శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ, దక్షిణక్షేత్ర వ్యవసాయ యంత్ర పరికరాల శిక్షణా సంస్థ సంయుక్తంగా వ్యవసాయ పనిముట్ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. రోజువారి సేద్యంలో నూతన వ్యవసాయ పరికరాలను ఎలా వినియోగించాలి, ఇక్కడి రైతులకు అవసరమైన పనిముట్లు, యంత్రాల ఎంపిక, వాడే విధానాలను వివరించారు. అనంతరం మహిళలతో చెట్లలో కొమ్మలు కత్తిరింపజేశారు. ఏవోలు సంధ్య, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ రూపేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాన్ని అప్పగించాలని నిరసన

పలమనేరు: నెల్లూరు జిల్లా కందుకూరు వద్ద రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో తమ గ్రామస్తుడు మృతిచెందాడని, ఇప్పటి వరకు మృతదేహాన్ని ఇవ్వకుండా నెల్లూరు ఆస్పత్రి సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని బేలుపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు మృతుని కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం పలమనేరు-కుప్పం రహదారిపై నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రెండ్రోజుల క్రితం బేలుపల్లికి చెందిన దళిత యువకుడు భాస్కర్ హోసూరు నుంచి గుంటూరుకు బంతిపూల లోడుతో వెళ్లాడన్నారు. నెల్లూరు జిల్లా కందుకూరు వద్ద బొలేరో వాహనాన్ని లారీ ఢీకొనడంతో మృతిచెందాడని పేర్కొన్నారు. అక్కడి పోలీసులు యువకుడి మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని వెల్లడించారు. రెండు రోజులవుతున్నా మృతదేహాన్ని అప్పగించలేదని వాపోయారు. గ్రామస్తుల ధర్నాతో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. మృతదేహం త్వరగా అప్పగించేలా చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.



బేలుపల్లి క్రాస్ వద్ద రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు



తమ బిడ్డ మృతదేహాన్ని ఇప్పించాలని రోదిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

విద్యుత్ చౌర్యానికి చెక్ పెట్టండి

- ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో విద్యుత్ చౌర్యానికి అధికారులు చెక్ పెట్టాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో డీపీఈ(విద్యుత్ చౌర్యం నివారణ) విభాగం అధికారులతో సమావేశమై ఆయన మాట్లాడారు. నగర, మండల, గ్రామ స్థాయిలో తరుచూ తనిఖీలు చేయాలన్నారు. ప్రధానంగా విద్యుత్ చౌర్యం సంస్థ ఆదాయానికి లోటుగా మారుతోందని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో డీపీఈ ఈఈ హరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టులోని ఎల్‌ఎల్‌బీ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో శుక్రవారం పేకాట స్థావరంపై తాలూకా పోలీసులు దాడులు చేశారు. ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు ద్విచక్రవాహనాలు, రూ.6 వేల నగదు, మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లికార్జున, పోలీసులు పాల్గొన్నారు.

5న 'రండి..టీ తాగుతూ మాట్లాడుకుందాం..!'

- ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య

ఐరాల: ఉద్యోగుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 5న మంగళవారం చిత్తూరులో అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద 'రండి..టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.శివయ్య తెలిపారు. శుక్రవారం కాణిపాకంలో ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఉద్యోగుల సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలతో పాటు ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలపై చర్చించినట్లు చెప్పారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు సుమారు రూ.25 కోట్ల సంబంధించి, దాదాపుగా 12 రకాల సమస్యలపై ఈ కార్యక్రమాన్ని మూడు నెలల పాటు జిల్లాలో నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంపై జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులకు, తాలూకా ఆఫీస్ కార్యవర్గ సభ్యులకు మార్గదర్శనం చేశారు. 5వ తేదీ నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డి.నరేష్‌బాబు, కోశాధికారి ఎం.దేవకుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వి.బాలాజిరెడ్డి, జాయింట్ కార్యదర్శులు హరిప్రసాద్, మనోజ్‌కుమార్, గౌరీశంకర్, చిత్తూరు తాలూకా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మోహన్, కృష్ణమూర్తి, కార్యదర్శి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శివయ్య

ప్రతి విద్యార్థికీ ఆధార్

గుడిపాల: మండలంలోని ప్రతి విద్యార్థికీ ఆధార్ కార్డులు ఇవ్వనున్నట్టు మండల విద్యాశాఖాధికారి హసన్‌బాషా తెలిపారు. శుక్రవారం గుడిపాల మండలంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 20 మంది విద్యార్థులకు ఇప్పటివరకు ఆధార్ కార్డులు లేకపోవడంతో వారందరినీ వసంతాపురం సచివాలయంలో ఆధార్ సెంటర్‌కు రప్పించి, ఆధార్ కార్డులు తీయించారు. ఇంకా ఎవరైనా ఉంటే వారిని కూడా గుర్తించి ఆధార్ కార్డులను తీసిస్తామన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం





మాట్లాడుతున్న రాజేశ్వరి, తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి పద్మావతి



పుంగనూరు : ఎర్రగుంట్లపల్లెలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

రొంపిచెర్ల: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి తెలిపారు. రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని బలిజవీధి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డకు పాలు ఇవ్వడంతో తల్లికి బిడ్డకు మంచి అనుబంధం ఏర్పడుతుందన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. తద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు పాలు పట్టాలని పేర్కొన్నారు. ఆరు నెలల తర్వాత తల్లి పాలతో పాటు అదనపు ఆహారం ఇవ్వాలన్నారు. పోత పాలు, బాటిల్ పాలు తాగితే పిల్లలకు శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అమ్మన్ని, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీ గీతా, ఏఎన్ఎం సితార, అంగన్‌వాడీ టీచర్ షాహీన, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

బైరెడ్డిపల్లె: బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మావతి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తీర్థం పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పాలు పట్టడం వల్ల తల్లికి బిడ్డకు మంచి అనుబంధం ఏర్పడుతుందన్నారు. తల్లిపాలల్లో రోగ నిరోధక శక్తి వుంటుందని తెలిపారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, హెచ్ఎస్ తిరుమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



పలమనేరులో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

పలమనేరు: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సజ్మా తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రంగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిబిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుందన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టం

పుంగనూరు: తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. నేతిగుట్లపల్లె సచివాలయ పరిధిలోని ఎర్రగుంట్లపల్లెలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. బిడ్డ అనారోగ్యంగా ఉన్నా తల్లిపాలు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కిరణ్మయి, ఏఎన్ఎం నాగవేణి, అంగన్‌వాడీ కార్యకర్త సుగుణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ఏకపక్ష ధోరణి విడనాడాలి

పుంగనూరు: ఘర్షణపై ఇరువర్గాలపై కేసులు నమోదైనా పోలీసులు ఒకరిని అరెస్టు చేసి, మరొకరని వదిలేశారని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్ ఆరోపించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని మార్లపల్లెలో దళిత సామాజిక వర్గానికి చెందిన చిరంజీవి గత నెల 11న కుటుంబ సభ్యులతో కలిసి బైక్‌లో వెళ్తుండగా వంశీ హేళనగా మాట్లాడారని తెలిపారు. దీంతో ఘర్షణ జరిగి ఇద్దరూ గాయపడ్డారని తెలిపారు. పోలీసులు రెండు వర్గాలపైనా కేసు నమోదుచేశారని వెల్లడించారు. ఈ కేసులో వంశీని అరెస్ట్ చేసి, చిరంజీవిని వదిలేశారని విమర్శించారు. ఈ క్రమంలో మాలమహానాడు ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. దీనిపై సీఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ వారి ఆరోపణల్లో వాస్తవం లేదనానరు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని, చిరంజీవి తీవ్రంగా గాయపడ్డారని డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్ మేరకు వంశీని అరెస్ట్ చేశామన్నారు.